క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు వితరణ



ప్లేట్లు అందుకున్న చిన్నారులతో విజయమ్మ

కూసుమంచి: మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిమిత్తం కందాల ఫౌండేషన్ ఆధ్వర్యాన పేట్లు, గ్లాసులను వితరణ చేశారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి సతీమణి విజయమ్మ బుధవారం వీటిని ఆయా పాఠశాలల విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. కాగా, తొలిరోజు 549 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పాఠశాలల హెచ్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాంతం ఎర్రజెండా కోసమే..

ఖమ్మం రూరల్: నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు వేగినాటి వెంకటేశ్వర్లు అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని తెల్దారుపల్లిలో వెంకటేశ్వర్లు సంస్మరణ సభ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వేగినాటి కుటుంబం పేదరికంలో ఉన్నా ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తన జీవితాంతం ఎర్రజెండా కోసం త్యాగం చేశారని చెబుతూ నివాళులర్పించారు. తన ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించారని ఆయన సేవలను కొనియాడారు. వెంకటేశ్వర్లు యొక్క ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ్మినేని వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, సర్పంచ్ సిద్దినేని కోటయ్య, విజయలక్ష్మి, బషీరుద్దీన్, సుదర్శన్, ప్రకాష్, బుచ్చిరామయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

గ్రానైట్ అనుమతులు ఇవ్వొద్దని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధితులు

నేలకొండపల్లి: దళితుల భూముల్లో గ్రానైట్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని బాధితులు స్థానిక తహసీల్దార్ దారా ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మండలంలోని చెరువు మాధారం గ్రామంలో 1099 బై 27కు సంబంధించిన దళితుల భూమిలో మైనింగ్ కొత్తగా ఎన్ఓసీ ఇచ్చినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అటువంటి భూమికి సంబంధించి అభ్యంతరాలు ఉంటే ఎన్ఓసీను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బాసుపాక వెంకటరత్నం, సూరేపల్లి రవి, సూరేపల్లి శ్రీను, నందిగామ జార్జి, శాంతమ్మ, ముత్యాలమ్మ, సూరేపల్లి నాగరాజు, అబ్రహం, ముత్తయ్య, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మనుచరిత్ర
శ్రీనివాస	ఇండియానా జోనెస్ అండ్ ది డయల్ ఆఫ్ డిస్టిని
సుందర్	అబ్నో సే బేవఫై

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	86	బచ్చలికూర	2
వంకాయ	46		10
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	100		10
కాకర	70	చుక్కకూర	2
సొరకాయ	20		10
బీర	56	తోటకూర	2
దొండ	34		10
పొట్లకాయ	46	గోంగూర	2
చిక్కుడు	80		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	66		15
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

అక్రమ వెంచర్లపై కొరడా..

అనుమతులు లేని వెంచర్లపై అధికారుల ఉక్కుపాదం

- హద్దు రాళ్లు, గోడల నిర్మాణాలు తొలిగిస్తున్న అధికారులు
- నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న వైనం
- ప్లాట్ కొన్నా.. భవన నిర్మాణాలకు అనుమతులు ఉండవు
- చేతివాటంతో గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు





అనుమతులు లేని వేపకుంట్ల వెంచర్‌లో గేటును తీయిస్తున్న అధికారులు (ఇన్‌సెట్) కూల్చివేసిన ప్రహరీ

రఘునాథపాలెం: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకోవాలంటే సుడా నామ్స్ ప్రకారం భూమి కన్వర్షన్ తప్పకుండా చేసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు రియల్టర్ల వెంచర్లు వేస్తుండడంతో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఒక వైపు అధికారులు పదే పదే చెబుతున్నప్పటికీ అక్రమ వెంచర్ల పర్వం మాత్రం ఆగడం లేదు.

వావ్ అనేలా అంతర్గత నిర్మాణాలు..

కొంతమంది వెంచర్లకు అనుమతులు అంటూ దరఖాస్తు చేసుకొని దాని పేరుతో అనుమతులు రాకుండానే అందమైన రోడ్లు, ఆకట్టుకునేలా ముఖద్వారం చేసి రియల్టర్లు అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న నగరంలోని విలీన గ్రామాల పరిధితో పాటు సమీప మండలాలైన రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, కూసుమంచి, కొణిజర్ల, చింతకాని, ముదిగొండ తదితర మండలాల పరిధిలో వెంచర్లు జోరుగా కొనసాగుతున్నాయి. కలెక్టర్ మండల, జిల్లాస్థాయి అధికారులతో పదే పదే సమావేశాల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నా.. బేఖాతరు చేస్తూ అక్రమ వెంచర్లు వెలుస్తూనే ఉన్నాయి. పూర్వకాలంలోని వెంచర్లను సైతం గుర్తించి ప్రభుత్వానికి రావాల్సిన గ్రీన్ బెల్ట్ స్థలాలను రాబట్టడంలో కలెక్టర్ ప్రయత్నం కొంతమేర ఫలించింది.

మండలవ్యాప్తంగా 120 వెంచర్లు..

జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వందల ఎకరాలకు పైగానే సేకరించినట్లు తెలిసింది. ఒక్క రఘునాథపాలెం మండలంలోనే పాత వెంచర్ల నుంచి సుమారు 21 ఎకరాలకు పైగా భూమిని సేకరించి ఆయా పంచాయతీల పరిధిలో రిజిస్ట్రేషన్లు చేయించారు. రఘునాథపాలెం మండలంలో వెలిసిన 120 వెంచర్లలో 33 వెంచర్లకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, మిగతా 87 వెంచర్లకు అనుమతులు లేకుండా అందమైన రహదార్లు వేసి అమ్మకాలు చేశారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాటిల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అనేకమందికి అమ్మకాలు జరిపారు.

గ్రీన్‌బెల్ట్ ద్వారా 28.13 ఎకరాలు సేకరణ..

అనుమతులు లేని వెంచర్లలో మిగులు ఉన్న ప్లాట్లను గుర్తించి గ్రీన్ బెల్ట్ కోసం నిర్వాహకుల నుంచి సేకరించారు. ఇలా సేకరించిన స్థలంలోనే ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పల్లె క్రీడాప్రాంగణాలు, ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అనుమతులు ఉన్న ఉన్న రఘునాథపాలెం మండల వెంచర్ల పరిధిలో గ్రీన్‌బెల్ట్ ద్వారా 28.13 ఎకరాలను సేకరించారు. గతంలో అధికారులు ఒత్తిడి ద్వారా 21 ఎకరాల వరకు వచ్చినట్లు అధికారులు చెపుతున్నారు.

అక్రమ వెంచర్లకు నోటీసులు..

గతంగతహః.. తాజాగా అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తున్న వాటిని గుర్తించి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా పనులు ఆపకుండా రోడ్లు, గేట్లు, ముఖద్వారం, ప్రహరీ నిర్మాణం చేస్తున్నారు. దీంతో అధికారులు జేసీబీ ద్వారా కొరడా ఝులిపించి ఆ నిర్మాణాలను తొలగిస్తున్నారు.

అనుమతులు అవసరం..

ఇటీవల రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు ఐదెకరాల్లో వెంచర్ చేయడమే కాకుండా వివాదంతో కొంతమేర కోర్టులో ఉన్న భూమిని సైతం ఆక్రమించారు. తర్వాత అందమైన రహదార్లు, చుట్టూ ప్రహరీ నిర్మాణం తదితర పనులు చేసి అమ్మకాలు సాగించేందుకు సిద్ధం చేశారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓ వెంచర్‌లో వేసిన రోడ్లు, ప్రహరీని అధికారులు దగ్గరుండి జేసీబీ ద్వారా తొలిగించారు. ఇలా ఒకటి, అర తొలగించినా ఇంకా చాలా వెంచర్లు ఇలానే ఉన్నాయి.

అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయాలని అధికారులు ఆయా మండలాల నుంచి రిజిస్ట్రేషన్ శాఖలకు లేఖలు పంపినా కొందరి అధికారుల చేతివాటంతో గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. పైగా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తేనే రిజిస్ట్రేషన్లు చేస్తామని చెప్పడం గమనార్హం.

నిర్వాహకులపై కేసు..

సుడా నామ్స్ ప్రకారం అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేయబడతాయిని, ఆ వెంచర్లలో కొనుగోలు చేసిన వారికి సైతం ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అనుమతులు లేని వాటికి నోటీసులు జారీ చేశామని, అనుమతులు వచ్చిన తర్వాతే ఏమైనా పనులు చేసుకోవచ్చని అధికారులు అంటున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా వెంచర్లు వేసి రోడ్లు, ఇతర నిర్మాణాలు చేపడితే వాటిని తొలగిస్తున్నాం. అంతేకాక నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నాం. ఒకవేళ ఆయా వెంచర్లలో ప్లాట్ కొంటే భవన నిర్మాణాలకు అనుమతులు ఉండవు. అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు లేఖలు సైతం పంపించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ, రఘునాథపాలెం

కలిసి నడిచేందుకు సిద్ధం..




పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నగరానికి చెందిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరికను స్వాగతిస్తున్నామని పేర్కొంటూ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో తామంతా పొంగులేటితో కలిసి పయనించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు ప్రకటించారు. పొంగులేటిని కలిసిన వారిలో కల్వకుంట్ల గోపాలరావు, కే.వీ. చారి, తూములూరి లక్ష్మీనరసింహారావు, దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు, పాయల నాగేశ్వరరావు, కైలాస వేణుగోపాలరావు, సోమిశెట్టి వెంకటేశ్వరరావు, చిగురు ప్రభాకర్‌రావు, పెనుగొండ శ్రీనివాసరావు, కొప్పెర ఉపేందర్, సాదె శంకర్, కేతినేని వేణు, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి..

రఘునాథపాలెం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఖమ్మంలో ఈనెల 2న తలపెట్టిన రాహుల్ సభను విజయవంతం చేయాలని పొంగిలేటి అనుచరుడు, డీసీసీబీ డైరెక్టర్ తుల్లూరి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పాపటపల్లి, జీకే బంజార, బుగ్గ బంజర తదితర గ్రామాల ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేరికను స్వాగతిస్తూ సభను విజయవంతం చేసేందుకు మండలం నుంచి భారీస్థాయిలో పొంగులేటి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగ సభకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ మలీదు జగన్, మాజీ సర్పంచ్ దుంపటి నగేష్ నాయకులు రవీందర్, రమేష, బాబురావు, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఏఓ సీతారాంరెడ్డి

తిరుమలాయపాలెం: రైతుల అవసరాలను సొమ్ము చేసుకునేందుకు నకిలీ విత్తనాలను అంటగట్టే వారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి అన్నారు. బుధవారం తిరుమలాయపాలెంలో విలేకరులతో మాట్లాడారు. అధిక దిగుబడి వస్తాయనే ఆశతో రైతులు పక్క రాష్ట్రాల నుంచి పత్తి, మిర్చి విత్తనాలు కొనుగోలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఆ విత్తనాలతో సరైన దిగుబడులు రాకపోతే ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. పత్తిలో మంచి కంపెనీలకు చెందిన హైబ్రిడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, యూట్యూబ్‌లో చూసి తక్కువ ధరకు అని చెప్పే మిర్చి విత్తనాలు కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు అధికంగా నష్టపోతారని చెప్పారు. రైతులు విత్తనాలకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, వరి సాగులో స్వల్ప కాలిక రకాలను సాగుచేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలపై తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఎస్సెస్సీ తరగతులు ప్రారంభం..



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ, సర్పంచ్

కూసుమంచి: పాలేరు గ్రామంలోని పాఠశాలలో పదో తరగతి క్లాసుల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అనుమతి ఇవ్వడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్సెస్సీ తరగతులు బోధించనుండగా బుధవారం ఎంపీపీ శ్రీనివాస్ నాయక్ సర్పంచ్ ఎడవెల్లి మంగమ్మతో కలిసి తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గ్రామంలో విద్యార్థుల సంఖ్య పెరగటంతో పదో తరగతికి అనుమతి రావడం మంచి అవకాశమని పేర్కొన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.10వేల చొప్పున ప్రోత్సాహక బహుమతిని ఇస్తానని ఎంపీపీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ ఎంఈఓ శ్యాంసన్, ఉప సర్పంచ్ యాఖుబ్‌పాషా, ఎస్ఎంసీ చైర్మన్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.


వడ్డెరలు ఐక్యత చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెరిపేటి సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: వడ్డెరలు ఎల్లప్పుడు ఐకమత్యంగా ఉండి ఐక్యత చాటాలని వడ్డెరల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలో డేరంగుల బ్రహ్మం, రాయల చందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఖమ్మం ఉమ్మడి జిల్లా ట్రస్ట్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌భగాయత్‌లో వడ్డెరల ఆత్మ గౌరవ భవన సుమదాయ నిర్మాణానికి ఎకరం స్థలం రూ.కోటి కేటాయించామని, కానీ కొంత మంది కుల నాయకులు అడ్డుపుల్ల వేసి ఆపారని ఆరోపించారు.అసెంబ్లీ నియోజక వర్గానికి బ్యాంక్ అకౌంట్ తీసి పేద వడ్డెరలకు సేవ చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్ డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, జిల్లా నాయకులు నర్రా ఎల్లయ్య, కుంచం వెంకటేశ్వర్లు, పల్లెపు సోమరాజు, పి.వెంకటేశ్వర్లు, కొండల్, దుర్గారావు, ఏడుకొండలు, రామకోటయ్య, టి.వెంకటనారాయణ, చంద్రారావు, తిరుమలరావు, వెంకన్న, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు ఆర్థిక సాయం



పౌష్టికాహార కిట్ అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందించాలని గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ తరపున పండ్లు పంపిణీతో పాటు ఒక్కో బాలింతకు రూ.వెయ్యి చొప్పున ఇద్దరికి బుధవారం ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తుమ్మలపల్లి నర్సింహారావు, వార్డు సభ్యులు మంద గోపి, మంద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.60లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. సుడా నిధులు రూ.60 లక్షలతో వీడీఎఫ్ టెక్నాలజీతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. నగరంలోని 25వ డివిజన్ అద్దంకి వారి వీధి వద్ద రూ.20 లక్షలతో, 29వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద రూ.20 లక్షలతో, 36వ డివిజన్ గాంధీ చౌక్ వద్ద రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్‌లు గోళ్ల చంద్రకళ వెంకట్, పసుమర్తి రాం మోహన్, దొన్వాన్ సరస్వతి రవి, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, డీఈ నవ్య జ్యోతి, స్వరూప రాణి, నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, పాలడుగు పాపారావు, కొప్పెర నర్సింహారావు, రుద్రగాని ఉపేందర్, వసంత్ బాబు, నున్నా మాధవరావు, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి వైద్య ఖర్చులు నిమిత్తం రూ.4.50లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని బుధవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో చింతగుర్తి సర్పంచ్ మెంటెం రామారావు, మార్కెట్ డైరెక్టర్ తాత వెంకటేశ్వర్లు, శ్రీపతి సోమశేఖర్, కూరపాటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల జాతిపిత పీవీ

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు అనేక సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పీవీ 102వ జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని లకారం సర్కిల్‌లో ఉన్న పీవీ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పీవీ అని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ తగిన రీతిలో గౌరవిస్తుందన్నారు. పీవీ సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని మంత్రి పువ్వాడ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, చిరుమామిళ్ల లక్ష్మి, ఆళ్ల నిరీష, రాపర్తి శరత్, కూరాకుల వలరాజు, ఆర్‌జేసీ కృష్ణ, ఈశ్వర హరిబాబు, కొల్లు పద్మ, వనం కృష్ణవేణి, సతీష్, రవికాంత్, ఎంఏ కరీం తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘాల ఆధ్వర్యాన..



నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నియోగి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పలివెల సుబ్బారావు, కోసూరు ప్రసాద్, రవి కిరణాచార్యులు, వనం కృష్ణవేణి, పరిమి అనంత లక్ష్మి, కొలిపాక అన్నపూర్ణ, మల్లిఖార్జున శర్మ, పర్చ రంగారావు, జీవీఎల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి



రాత పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు చిన్నతనం నుంచే శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని జిల్లావిద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ అన్నారు. బుధవారం నగరంలోని ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాసిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యాన విద్యార్థులకు రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా సమితి ఆధ్వర్యాన నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, వాసిరెడ్డి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సుబ్బారావు, వీరభద్రారావు, సభ్యులు మల్లిఖార్జున్‌రావు, వెంకటేశ్వరరావు, వెంకటాద్రి నాయుడు, నాగేశ్వరరావు, అర్జున్‌రావు, పాఠశాల హెచ్ఎం పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: డెక్టర్ సాఫ్ట్ ఐటీ సొల్యూషన్స్ కంపెనీలో ఎస్‌బీఐటీ విద్యార్థులు ముగ్గురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థులను అభినందించాక ఆయన మాట్లాడారు. ట్రెయినీగా స్కాలర్‌షిప్‌తో పాటు రూ.3లక్షల వార్షిక వేతనంతో సీ.బీ.ఆసిక్, కె.స్నేహ, ఎస్.కే.సమ్రీన్‌లు సాఫ్ట్‌వేర్ డెవలపర్లుగా ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడుతూ ఎప్పటిలాగే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. అకడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు పుష్పాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని నగరంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో బుధవారం సాయంత్రం సాయినాథునికి వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు సకల సంపదలు కలగాలని బాబావారికి కొబ్బరి నీళ్లతో అభిషేకం, నక్షత్ర దోష నివారణ కోరుతూ నక్షత్ర పాశుపత హోమం నిర్వహించారు. ఆశ్రమం చైర్మన్ లగడపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి, ఉపాధ్యక్షులు చౌడవరపు మధుసూదన్‌రావు, కొదుమూరు శ్రీనివాసరావు, కోశాధికారి కేతేపల్లి సంజయ్ పాల్గొన్నారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో రెడ్ కలర్స్‌డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్‌మైండ్స్ పాఠశాలలో బుధవారం రెడ్ కలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగాపాఠశాల విద్యార్థులు రెడ్ కలర్ దుస్తులు ధరించి రెడ్ కలర్ పండ్లు, బెలూన్లు ప్రదర్శనలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

57 ఏళ్ల అ'పూర్వ' కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కూసుమంచి: కూసుమంచి ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి (1966–70బ్యాచ్) వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువు నర్సయ్యను సత్కరించారు. 57 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఆనందాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దారా ఖాసీమ్, వీవీ నాగేశ్వరరావు, కొండా లక్ష్మయ్య, సైదులు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.